క్లుప్తంగా

ప్రజా వైద్యశాల పేరు సార్థకం చేసుకోవాలి

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ఏర్పాటు చేసిన ప్రజావైద్యశాల పేరును సార్థకం చేసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సూచించారు. విద్యాధరపురం రామరాజ్యనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజా వైద్యశాలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి సుమారు 300 మంది హాజరై వైద్య సేవలను పొందారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందని అన్నారు. వైద్యం ఖరీదైన నేపథ్యంలో డాక్టర్ శ్రావణ్ కుమార్ ప్రజావైద్యశాలను ఏర్పాటు చేసి నామమాత్రపు ఫీజుతో వైద్యం చేయటం పేద ప్రజలకు ఊరట కలిగిస్తుందన్నారు. ప్రజా వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే రెండు ప్రజావైద్యశాలలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రారంభించినది మూడవ బ్రాంచి అని తెలిపారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, బోయి సత్యబాబు, డాక్టర్ శ్రావణ్ కుమార్‌ను అభినందించారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

– జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, కేఆర్సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి హాజరయ్యారు. పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఈవో మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా ప్రకటించిన నాటి నుంచి వివిధ ఫారాల పరిష్కారం, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన, ఈవీఎంలను భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూములు, లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు తదితర అంశాలపై చేపట్టిన ఏర్పాట్లను ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన డ్రాయింగ్ ఆఫీసర్లు ఆయా శాఖలకు చెందిన ఉద్యోగస్తుల వివరాలను ఎంప్లాయీస్ డేటా వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంకనూ అప్‌లోడ్ ప్రక్రియ పూర్తిచేయని అధికారులు శనివారం లోగా వివరాలను నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై ఎన్నికల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుర్గమ్మ సన్నిధిలో భరత నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరు జిల్లా ఉండవల్లికి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర నాట్య మండలి ప్రదర్శించిన భరత నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నాట్యమండలికి చెందిన వేన్నిలా రెడ్డి, లక్ష్మీప్రియ, వైష్ణవి, జాహ్నవి, గమనశ్రీలు పలు కీర్తనలకు భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ధర్మపథంలో భాగంగా ప్రతి శుక్ర, శని, ఆదివారాలు అమ్మవారి సన్నిధిలో చిన్నారులు తమ నృత్య ప్రదర్శన ఇచ్చేందుకు దేవస్థానం అవకాశం కల్పిస్తుంది. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఉన్న దాసాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాన్ని ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు తెలిపారు. 17వ తేదీన ఉత్సవానికి అంకురార్పణ చేస్తారని పేర్కొన్నారు. గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండస్థాపన, మండపారాధన, వాస్తు పర్యగ్నికరణ, అగ్నిప్రతిష్టాపన, లక్ష్మీగణపతి హోమం, మూలమంత్రి హోమాలు ఉంటాయని తెలిపారు. 18వ తేదీన మంటప దేవతా హోమాలు, మూలమంత్ర హోమాలు, చండీ హోమం, క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, శ్రీరామ శ్రీహనుమన్మహ మంత్ర హవనం, ధాన్యాధివాసం, శ్రీ సీతా రామ కల్యాణం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 19వ తేదీన యంత్ర, విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



గడప గడపకు కార్యక్రమంలో కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతోందని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానీపురం ఊర్మిళానగర్ 43వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్ ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై తోపుడు బండ్లపై చిరువ్యాపారాలు చేస్తున్న వారితో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి పర్యటనకు వచ్చిన ఆసిఫ్‌కు డివిజన్ ప్రజలు స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో రూ. 25 కోట్లపై చిలుకు అభివృద్ధి జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, విద్యుత్ లైన్లకు మరమ్మతులు జరిగాయన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మళ్లీ రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. కార్పొరేటర్లు చైతన్య రెడ్డి, ఎలకల చలపతిరావు, మహమ్మద్ ఇర్ఫాన్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ తనుబుద్ది శేఖర్ రెడ్డి, నాయకులు బట్టిపాటి సంధ్యారాణి, శివ ఆత్మారావు, ఏ కృష్ణారెడ్డి, బి. నాగేశ్వరరావు, మధుబాబు, మహేంద్ర, ఎస్వీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే విజయవాడ నగరవ అభివృద్ధి చెందిందని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానీపురం 42వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, కార్పొరేటర్ పి. చైతన్యరెడ్డితో కలిసి ఇంటింటికి తిరిగారు. వైఎస్సార్ సీపీ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ డివిజన్‌లో పర్యటించారు. వెలంపల్లి కాలనీ పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ చైతన్యరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా సప్త వాహన సేవ



ఊరేగింపులో లక్ష్మీనారాయణస్వామి



సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): రథసప్తమిని పురస్కరించుకుని హర్టుపేట లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామి వారి సప్త వాహన సేవ కనుల పండువగా సాగింది. విజయవాడ నగరంలో ఉన్న ఏకైక శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహించిన ఈ సప్తవాహన సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు. ప్రతేకమైన అలంకారంలో స్వామి వారు ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనం, 8.30 నిమిషాలకు శేషావాహనం, 9.30 నిమిషాలకు గరుడ వాహనం, 10.30 నిమిషాలకు అంజనేయ వాహనం, సాయంత్రం 4 గంటలకు అశ్వవాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనంలో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, డప్పు, సన్నాయి వాయిద్యాల మధ్య సాగిన స్వామి వారి ఊరేగింపును తిలకించేందుకు స్థానికులు రోడ్లపై బారులు తీరారు. అడుగడుగున స్వామి వారికి కర్పూర హారతులు పడుతూ కొబ్బరి కాయలను కొట్టి తమ భక్తిని చాటుకున్నారు. ఒకే రోజున స్వామి వారు 7 వాహనాల్లో ఊరేగుతు ప్రత్యేక అలంకరణాలతో భక్తులకు దర్శనం ఇవ్వటంతో దర్శించుకున్న భక్తులు పులకరించిపోయారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అలయ కమిటీ కార్యదర్శి కృష్ణప్రసాద్, కమిటీ సభ్యులు శంకరావు, శ్రీనివాస చక్రవర్తి, మాధవరావు, హరినాథ్, జయ లక్ష్మీ, శ్రీదేవి, పద్మాలత తదితరులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి విశేష పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న సూర్యభగవానునికి శుక్రవారం పలు విశేష పూజలు నిర్వహించారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. భక్తులు ఉచితంగా గోక్షీరాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ నగరంలో ఎక్కడ సూర్యనారాయణమూర్తి ఆలయం లేదన్నారు. తమ మందిరం ప్రాంగణంలోనే స్వామి వారు కొలువై ఉన్నారని చెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. కార్యక్రమాలను శ్రీకృష్ణ ప్రార్థన మందిరం కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రథసప్తమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని నూతన రాతి మండపంలో సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అరుణ పారాయణ సారం, సూర్య నమస్కారాలు, సూర్య జపాలు, ఆదిత్య హృదమ పఠనాన్ని వైభవంగా నిర్వహించారు. సమస్త లోకాలకు వెలుగులను ప్రసాదించే సూర్య భగవానుడికి ఆరాధించడం వల్ల ఆరోగ్య సిద్ధి, లోక సంరక్షణ జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ఈవో రామారావు సూర్య నమస్కారాలు శక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

టీడీపీ నాయకుల శవ రాజకీయాలు సిగ్గుచేటు

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆగ్రహం



ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లు దహనం చేస్తున్న శేషు, ఇతర నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ యువ నాయకుడు కైకాల చరణ్ మరణంపై టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా అసత్య ఆరోపణలు చేయడం, తప్పుడు కథనాలు ప్రచురించడం సిగ్గుచేటని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగ్‌నగర్ నందమూరినగర్‌లోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం జరిగింది. శేషు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయం కోసం పరితపించే మంచి యువ నాయకుడు కైకాల చరణ్ అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఎన్నికల్లో ఎలా అయినా లబ్ధి పొందాలనే దుర్మార్గపు ఆలోచనలతో బొండా ఉమా ఈ మరణాన్ని కూడా తన నీచ రాజకీయాల కోసం వాడుకోవాలని చూడటం హేయమని మండిపడ్డారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ విజయం కోసం పనిచేసే చరణ్‌ను వెలంపల్లి ఎందుకు వేధింపులకు గురిచేస్తాడని ప్రశ్నించారు. మానవత్వం మంటకలిసే విధంగా బొండా ఉమా వ్యవహరించడం దారుణమన్నారు. వెలంపల్లి ఒత్తిళ్లతోనే కైకాల చరణ్ చనిపోయారంటూ టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం, వాటిని తోక పత్రికలైన ఆంధ్రజ్యోతి, ఈనాడులో ప్రచురించడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు.

ఈనాడు ఆంధ్రజ్యోతి విషపు రాతలను కాపు నేతలంతా ఖండిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ వెనకాల తిరుగుతున్నాడని టీడీపీ నాయకులే చరణ్‌ను బెదిరించి ఉంటారని మాకు కూడా అనుమానంగా ఉందన్నారు. కాపుల వ్యతిరేక పార్టీ తెలుగుదేశం అని, వంగవీటి మోహన్ రంగాను చంపిన దగ్గర నుంచి కాపులంతా ఆ పార్టీని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పచ్చ మీడియా నీచ రాతలపై న్యాయ పోరాటం చేస్తాం అని, చరణ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం అని తెలిపారు. కాపు సంఘం నాయకులు చింతా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను చూస్తుంటే బొండా ఉమాకు వణుకుపుడుతుందని పేర్కొన్నారు. ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేక ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చరణ్ భౌతికకాయాన్ని దర్శించకుండా, కనీసం వారి కుటుంబాన్ని పరామర్శించని బొండా ఉమా, టీడీపీ నాయకులు అతని మరణంపై అసత్య ఆరోపణలు చేసి, వారి కుటుంబ పరువును రోడ్డుకు ఈడ్చడం దారుణమన్నారు. బొండా ఉమా, టీడీపీ నాయకులు ఇలానే శవరాజకీయాలు చేయాలని చూస్తే తగిన గుణపాఠం గట్టిగా చెబుతామని హెచ్చరించారు. అనంతరం ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను తగలబెట్టారు. కాపు సంఘం నాయకులు కమ్మిలి రత్నాకర్, దుర్గ గుడి మాజీ ధర్మకర్త కనుగుల బాల,మాత మహేష్,చింతలపూడి రమేష్, ఎంఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో జుబేద ప్రతిభ



జుబేదకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న రాజారావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జెకె గోజూరై కరాటే అకాడమి (గొల్లపూడి) ఆధ్వర్యాన గొల్లపూడిలో ఇటీవల నిర్వహించిన ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని పఠాన్ జుబేద తన ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచింది. పోటీల్లో భాగంగా అండర్ 13–14 కటా, కుమితే విభాగాల్లో రెండవ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జుబేదను పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు అభినందిస్తూ భవిష్యత్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ పాఠశాలలో విద్యను బోధించటంతోపాటు విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడా, సాంస్కృతిక రంగాల్లో శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. అదే విధంగా పోటీ పరీక్షలకుకూడా హాజరయ్యేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల సెక్రటరీ బి శ్యామ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ కె లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు జుబేదను అభినందించారు.

ఏడు జన్మల దోషాలకు... ఏడు ప్రదక్షిణలు



సూర్యప్రభ వాహనంపై స్వామి వారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రథసప్తమిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారి ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై స్వామి వారు ఆలయ మాడ వీధుల్లో ఏడు పర్యాయాలు ప్రదక్షిణ నిర్వహించారు. స్వామి వారు సూర్యప్రభ వాహనంపై కొలువై ఉండగా, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు ముందుకు సాగింది. మాఘ మాస శుద్ధ సప్తమిన ఎవరైతే సూర్యభగవానుడిని ఆరాధిస్తారో.. స్వామి వారి ఆలయం చుట్టూ ఏడు పర్యాయాలు ప్రదక్షిణ నిర్వహిస్తారో వారికి గత ఏడు జన్మల్లో కలిగిన దోషాలు తొలగిపోతాయని ఆలయ ప్రధాన అర్చకులు రామరత్నమాచార్యులు పేర్కొన్నారు. స్వామి వారికి ఆలయ సహాయ అర్చకులు శ్రీనివాసుల గోపాల్ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

సిబ్బందికి విధులు కేటాయింపు

ఇంద్రకీలాద్రి: మల్లేశ్వరాలయంలో సిబ్బందికి విధులను కేటాయిస్తూ ఆలయ ఈవో కేఎస్ రామారావు ఆదేశాలు జారీ చేశారు. ద్వారకా తిరుమల నుంచి బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ టి. అనురాధను మల్లేశ్వరాలయం వద్ద దర్శన టికెట్లు, ప్రసాదం టికెట్ల విక్రయ కౌంటర్‌లో మొదటి షిఫ్టు విధులు కేటాయించారు. అటెండర్ ఎం.మనోహర్‌ను దర్శనం, ప్రసాదం టికెట్ల విక్రయ కౌంటర్‌లో రెండో షిఫ్టు విధులు అప్పగించారు. ఇక ప్రసాదం కౌంటర్లలో మొదటి షిఫ్టుకు అవుట్ స్టోర్సింగ్‌కు చెందిన ఎస్. ప్రసాద్‌కు మొదటి షిఫ్టు, ఎం. గీతకు రెండో షిఫ్టు విధులు ఇచ్చారు. బాలాలయంలో విధులు నిర్వహిస్తున్న బి.చిన్నమ్ములును మల్లేశ్వరాలయంలో క్యూలైన్ల పర్యవేక్షణ మొదటి షిఫ్టు, టి. నాగమణికి రెండో షిఫ్టు విధులు కేటాయించారు. బాలాలయంలో విధులు నిర్వహిస్తున్న బి. శేషాచలంను పవిత్ర సారె కౌంటర్‌కు , కుంకుమ ప్రసాదం ప్యాకింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టి. లక్ష్మిని పొంగలి షెడ్డుకు బదిలీ చేశారు.

పరిశుభ్రత చర్యలు

భవానీపురం: 38, 39 డివిజన్ల కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, గుడివాడ నరేంద్ర రాఘవ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని ముస్లిం బరియల్ గ్రౌండ్‌ను పరిశుభ్రం చేశారు. గ్రౌండ్‌లోని చెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు.

19న నీటి సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం పరిధిలోని డాక్టర్ కెఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాలకు సరఫరా అయ్యే తాగునీటికి ఈ నెల 19వ తేదీ సాయంత్రం అంతరాయం కలగనుంది. ఈ మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హెడ్ వాటర్ వర్క్స్‌లోని 8 ఎంజీడీ, 5 ఎంజీడీ (కొత్త ప్లాంట్)కు సంబంధించిన 900 ఎమ్ఎమ్ డయా పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌తోపాటు కొత్తగా వేసిన 500 ఎంఎం డయా పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ (40వ డివిజన్ పరిధిలోని లారీ స్టాండ్‌లో కొత్తగా నిర్మించిన రిజర్వాయర్ ఇన్‌లెట్)కు ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్న కారణంగా పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలుపుదల చేయనున్నారు. జీవీఆర్ నగర్, వాంబేకాలనీ, ఉడాకాలనీ, కండ్రిక విలేజ్, ఆంధ్రప్రభ కాలనీ, న్యూ రాజరాజేశ్వరి పేట, అజిత్‌సింగ్‌నగర్, ప్రకాష్ నగర్, రాజీవ్‌నగర్, శాంతినగర్, ఎస్ఎస్‌సీ బోస్ నగర్, ప్రైజర్ పేట, టన్నెల్ బూస్టర్ ప్రాంతాల్లో 19 సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. కాగా డైరెక్ట్ వాటర్ సప్లై అయ్యే కేదారేశ్వరపేట, పాత రాజరాజేశ్వరిపేట, వాంబే కాలనీ, శాంతినగర్, సింగ్‌నగర్, కెఎల్‌రావునగర్, మిల్క్ ప్రాజెక్ట్ ప్రాంతాల్లోకూడా ఆ రోజు తాగునీటి సరఫరా ఉండదు. తిరిగి 20వ తేదీ మంగళవారం ఉదయం నుంచి యధావిధిగా నీటిసరఫరా జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వన్‌టౌన్‌లో ఐడీబీఐ బ్యాంక్ శాఖ ప్రారంభం



బ్యాంక్‌శాఖను ప్రారంభిస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్ శరత్‌కామత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని వన్‌టౌన్‌లో ఐడీబీఐ బ్యాంక్ తన నాలుగో శాఖను శుక్రవారం ప్రారంభించింది. ఆ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ శరత్ కామత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ శరత్ కామత్, జోనల్ మేనేజర్ వి.వాసుదేవన్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా శరత్‌కామత్, వాసుదేవన్ మీడియాతో మాట్లాడుతూ మంచి ప్రజాదరణతో ఐడీబీఐ బ్యాంకు నడుస్తుందన్నారు. విజయవాడలో పోరంకి వద్ద, స్టెల్లా కాలేజ్ వద్ద, గవర్నర్‌పేటలోనూ తమకు శాఖలు ఉన్నాయన్నారు. వ్యాపార వాణిజ్య వర్గాలు అధికారంగా ఉండే వన్‌టౌన్ ప్రాంతంలో నాలుగో శాఖను ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. నూతన బ్యాంక్ శాఖ సేవలను వినియోగించుకోవాలని వ్యాపార వాణిజ్య వర్గాలను వారు కోరారు. తమ బ్యాంకుకు దేశవ్యాప్తంగా 1970కి పైగా శాఖలు ఉన్నాయని, 2.78 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు వేల కోట్ల నెట్ ప్రాఫిట్ లక్ష్యంగా బ్యాంకు పురోగమిస్తుందని, డిసెంబర్ వరకు నాలుగు వేల కోట్ల రూపాయల నెట్ ప్రాఫిట్‌ను సాధించామన్నారు. కొత్తగా 300 రోజుల డిపాజిట్ల పథకాన్ని ప్రారంభించామని దీనిలో 7.05 శాతం వడ్డీ ఇస్తామని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లకు 7.55 శాతం వడ్డీని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్ సాయికృష్ణ, నూతన వన్‌టౌన్ బ్రాంచ్ మేనేజర్ మాదాసు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా గోల్డ్ మెడల్ సంస్థ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ జైన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ పాలకవర్గ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వడ్డి సురేంద్రబాబు, ఆపరేషనల్ మేనేజర్ తుమ్మపూడి శిరీష, బ్యాంకు ఉద్యోగులు, పలువురు ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్ పిలుపు



ఆసిఫ్, గౌస్ మొహిద్దీన్‌లను సత్కరిస్తున్న మసీదు పెద్దలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. 45వ డివిజన్ పరిధిలోని మక్దుమ్ మసీదును ఆయన వక్ఫ్‌బోర్డ్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. మసీదులో వారు స్థానిక ముస్లిం మైనార్టీలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మసీదు పెద్దలు వారికి సాదర స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమి 2014లో నగరంలోని ప్రార్థనా మందిరాలను నిర్దాక్షణ్యంగా కూల్చివేసిందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలపట్ల చిన్నచూపు ఉన్న చంద్రబాబుతో కలిసి పయనిస్తున్న పవన్‌కల్యాణ్‌ను మైనార్టీలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. అటువంటి వ్యక్తులతో అప్రమత్తంగా ఉంటూ రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పవిత్ర మక్కా మసీదు యాత్రకు వెళ్లేందుకు ఎన్నో సౌకర్యాలను కల్పించారన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని, పశ్చిమంలో ఆసిఫ్‌ను గెలిపించుకుంటామని పలువురు మైనార్టీలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు జానీ, కాలేషా, అఫ్జల్, ఖాసీం, హబిబుల్లా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో రథసప్తమి ఉత్సవం

ఏడు వాహనాలపై ఊరేగిన స్వామి వారు



సూర్యప్రభ వాహనంపై స్వామివారు



అశ్వవాహనంపై స్వామి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని పురాతన ఆలయమైన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం రథసప్తమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఉభయదేవరులతో కలిసి ఏడు వాహనాల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా శ్రీవారు వన్‌టౌన్‌లోని ఆలయంలోనూ ఏడు వాహనాలను అధిరోహించి భక్తులను తన్మయుల్ని చేశారు. ఉదయం భూసమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామి వారి మూర్తులకు అభిషేకాలు చేశారు. అనంతరం సర్వాభరణ భూషితుడైన స్వామిని తొలుత సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామిని ఊరేగించారు. అనంతరం శేషవాహనంపై స్వామిని అధిష్ఠింపజేసి ఊరేగించారు. అలాగే హనుమత్, గరుడ వాహనాలను ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ స్వామి వారిని ఊరేగించారు. అంతరం గజ, అశ్వ వాహనాలతో పాటుగా సాయంత్రం పుల్ల పల్లకీ వాహనాలపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి ఊరేగారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయంలో స్వామి వారికి విశేష అర్చనలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పాలకవర్గ సభ్యుడు గర్రె సురేష్ తదితరులు పాల్గొన్నారు.